# పహారా హుషార్

## ఎస్. పురుషోత్తమాచార్య

హఠాత్తుగా పరిసరాల్లో కలకలం బయలుదేరింది.

"ఏయ్ ! ఏవిటాగోల?" అరిచేడు ఇన్స్పెక్టర్ సింహాచలం.

"కర్ఫ్యూ సడలించాం కదండి! జనం పరుగెడుతున్నారు" సమాధానం చెప్పాడు కానిస్టేబుల్ వెంకటప్పయ్య.

"ఛ! అయితే ఓ రెండు గంటలు ఈ గోల భరించక తప్పదన్నమాట!" విసుక్కున్నాడు సింహాచలం.

"మూడురోజులయిందికదండి! జనాలకి పన్లుంటయ్ !" గొణిగేడు వెంకటప్పయ్య.

ఇన్స్పెక్టర్ సింహాచలం అతడి మాటల్ని వినిపించుకోలేదు. ఏదో ఆలోచనలో పడిపోయాడు.

"సార్! ఓసారి నేనుకూడా ఇంటిదాకా వెళ్ళొస్తాను" చేతులు నలుపుకున్నాడు వెంకటప్పయ్య.

సింహాచలం అతడిని అదోలా చూచేడు.

"ఏవోయ్ బండి హుషారుగా వుందే! ఈ రెండు గంటలు నీవుకూడా కుషీ కొడదామని చూస్తున్నట్లుంది. మరి నామాటేమిటి? నేను మాత్రం మూడురోజుల్నుంచి స్టేషన్‌లో చావడంలేదా?"

వెంకటప్పయ్యకి గొంతారిపోయింది. ప్రెటోలింగ్ పేరుపైన అడపాదడపా ఇన్స్పెక్టర్ తన ఇంటికి వెళ్ళొస్తుండడం అందరికీ తెలుసు. కాని పైకి అనే ధైర్యం ఎవరికీ లేదు. అయినప్పటికినీ కొంచెం సాహసించేడతను.

"ఇంట్లో మా ఆవిడ ఒకత్తే వుంటున్నదని చెప్పేనుకద సార్! భయపడుతుందేమోనని..." నసిగేడు వెంకటప్పయ్య.

"ఫర్లేదులేవోయ్! మరో నాలుగు గంటలు ఓపిక పడితే మనకి రిలీఫ్ వస్తుంది. అందరమూ వెళ్ళిపోవచ్చు!" అంటూ లేచి వరండాలోకి నడిచేడు సింహాచలం.

నీరుగారిపోయేడు వెంకటప్పయ్య. భయంతో మరోసారి నోరు మెదపలేకపోయాడు. మూడు రోజులనుంచి నిర్విరామంగా చేస్తున్న డ్యూటీవల్ల కలిగిన అలసట కాస్తా అతనికాళ్ళని ఢీలా పడవేసింది.

నీరుగారిపోయేడు వెంకటప్పయ్య. భయంతో మరోసారి నోరు మెదపలేకపోయాడు. మూడు రోజులనుంచి నిర్విరామంగా చేస్తున్న డ్యూటీవల్ల కలిగిన అలసట కాస్తా అతనికాళ్ళని ఢీలా పడవేసింది. సిగరెట్ వెలిగించి...

సిగరెట్ వెలిగించి తిరిగి లోనికొచ్చి కూర్చున్నాడు ఇన్స్పెక్టర్ సింహాచలం. సిగరెట్ పొగలమధ్యనుంచి యధాలాపంగా కానిస్టేబుల్ వెంకటప్పయ్యవంక చూచేడతను.

"ఏవిటోయ్ ఆ ఆముదం తాగిన మొహం? ఎనిమిదింటికి మళ్ళీ కర్ఫ్యూ మొదలవుతుంది. నీ డ్యూటీ పన్నెండుదాకా! అంటే మరో నాలుగు గంటలు! ఆ తర్వాతెలాగూ రిలీవ్ అవుతావు. వెంటనే నిద్ర లాగించెయ్ ! తెల్లారగావే ఇంటికెళ్ళొచ్చు!" అంటూ ఫైళ్ళలో తలదూర్చేడు సింహాచలం.

కానిస్టేబుల్ వెంకటప్పయ్య కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి. వరండా చివరన చతికిలబడిపోయి కళ్ళు మూసుకున్నాడతను.

పెళ్లయి ఆరేళ్లయినా చెక్కుచెదరని అందాన్ని మూటకట్టుకున్న భార్య కనకం కళ్ళు మూసుకున్నా కళ్ళ నిండా నిండిపోయింది. వీధిలో జీపు ఆగిన ధ్వని వినవచ్చి కళ్ళు తెరిచేతడను.

ప్రెటోల్ డ్యూటీకి వెళ్ళిన జవాన్లు ఓ నాలుగు పాల పాకెట్లనీ, కాఫీ నిండి వున్న ఫ్లాస్కునీ ఇన్స్పెక్టర్ సింహాచలం ముందుంచి రైటర్ రూంలోకి వెళ్ళిపోయారు.

"వెంకటప్పయ్యా! కావాలనుకుంటే ఓ పాలపాకెట్‌ని ప్రెటోల్ డ్యూటీవాళ్ళతో మీ ఇంట్లో ఇవ్వమంటాను. నీ భార్యకీ పిల్లలకీ పనికొస్తాయ్!" అన్నాడు సింహాచలం.

కొరడాతో వెన్నున కొట్టినట్లుగా ఉలిక్కిపడ్డాడు వెంకటప్పయ్య.

"నాకు పిల్లలు లేరు సార్..." అంటూ తడబడుతూ వెనక్కడుగువేసేడతను.

అవతల జీపు స్టార్టవుతున్నా కదలని వెంకటప్పయ్యని గమనించడం మానుకుని ఫ్లాస్కులోని కాఫీని కప్పులోకి వంచసాగేడు సింహాచలం.

మళ్ళీ నిశ్శబ్దం చోటుచేసుకుంది.

చేతిలోని రైఫిల్‌ని అలవోకగా నిమురుతూ వీధిలోనికి నిర్వీర్యంగా చూస్తూ నించునిపోయేడు వెంకటప్పయ్య.

రోడ్లన్నీ నిర్మానుష్యంగా వున్నాయి. రాత్రి పదిన్నర ప్రాంతంలో రిలీఫ్ వ్యాన్‌వచ్చి రిలీవర్లని దింపి వెళ్ళిపోయింది. వాళ్ళని చూడగానే వెంకటప్పయ్య ప్రాణం లేచివచ్చినట్లయింది. "మరో గంటన్నర! ఆ తర్వాత...." తృప్తిగా కళ్ళు మూసుకున్నాడతను.

వ్యాన్ అలా వెళ్ళగానే డిఎస్పీ జీపు స్టేషన్ ముందాగింది. సింహాచలం పరుగెత్తి డిఎస్పీని సాదరంగా లోనికాహ్వానించేడు. ఇరువురూ కంట్రోల్ రూంలోకెళ్ళిపోవడంతో స్టేషన్ మొత్తం నిర్మానుష్యమైపోయింది. వెంకటప్పయ్య సెంట్రీ డ్యూటీలో ఒంటరిగా మిగిలిపోయాడు.

సరిగ్గా పన్నెండు గంటలకి రిలీవర్ రాగానే వరండా చివరన పక్క వేసుకుని నిద్రలోకి జారిపోయాడు వెంకటప్పయ్య.

అరగంట తర్వాత డిఎస్పీ వెంట జీపులో వెళ్ళబోతూ నిద్రపోతున్న వెంకటప్పయ్య ప్రక్కనో పాలపాకెట్‌ని పడవేసి వెళ్ళిపోయాడు ఇన్స్పెక్టర్ సింహాచలం.

ఓ రాత్రివేళ చంద్రుడు మబ్బుల్లోకి తప్పుకున్నాడు. నిద్రలో పక్కకి తిరిగిన వెంకటప్ప




య్య జేబులోంచి తాళాల గుత్తి ఒకటి జారిపడిం ది. ఆ ధ్వనికి మెలకువ వచ్చిందతనికి. ఏ రాత్రయినా వీలుపడితే ఇంటి తలుపులు తీసుకోవడానికి తెచ్చుకున్న డూప్లికేటు తాళాల గుత్తి అది. దాన్నందుకుంటుండగా మళ్ళీ కనకం గుర్తుకొచ్చిందతనికి. దాంతో నిద్రకాస్తా చెదరిపోయింది. లేచి కూచున్నాడతను.

రాత్రి రెండు దాటింది.

ఉదయం దాకా తనకి ఇల్లు చేరేందుకు మార్గం లేదు. తనలాంటి సెంట్రీ కానిస్టేబుల్స్‌ని కర్ఫ్యూ ప్రాంతాల్లోని ఇళ్ళకి చేర్చాల్సిన వ్యాను ఉదయంకాని రాదు. అంతవరకూ ఈ జాగారం తప్పదు. డ్యూటీలో లేకున్నా ఇల్లు చేరుకోలేని తన దౌర్భాగ్యానికి చింతిస్తున్న వెంకటప్పయ్యకి జీపువస్తున్న ధ్వని వినిపించింది.

లేచి నుంచున్నాడతను.

డీఎస్పీగారి జీపు తిరిగి వచ్చింది. డ్రైవర్ దిగి లోనికి పరిగెత్తాడు.

"ఇందాక డీఎస్పీగారు తమ కళ్ళద్దాల్ని కంట్రోల్ రూంలో మరచిపోయారంట!" అంటూనే కళ్ళద్దాలతో వెనక్కి తిరిగొచ్చేడతను

వెంకటప్పయ్య బుర్ర వెంటనే పనిచేసింది. జీపు తమ ఇంటివైపునుంచే డిఎస్పీగారింటికెళ్ళాల్సి వుంటుందన్న విషయం గుర్తొచ్చిందతనికి.

పరుగెత్తాడతను.

వెంకటప్పయ్యని తీసుకెళ్ళేందుకు డ్రైవర్ అంగీకరించాడు.

మెయిన్‌రోడ్డులో జీపు దిగి సందులోని తమ ఇంటి తలుపుల్ని తెరిచేడు వెంకటప్పయ్య. ఇంటి వాతావరణం చూట్టంతోనే మూడురోజుల అలసటతో నిద్రకాస్తా ముంచుకొచ్చిందతనికి

"కనకం! కనకం!" కళ్ళు మూతలు పడుతుండగా పిలిచాడు వెంకటప్పయ్య.

సమాధానం రాలేదు.

యూనిఫారం షర్ట్‌ని విప్పుకుంటూనే పడగ్గదిలోకి వెళ్ళి షర్ట్‌ని బట్టల స్టాండ్‌పైన పడవేసి లైటుని వెలిగించబోయేడు వెంకటప్పయ్య.

"ఏవండీ!" కనకం గొంతులోని ఆదుర్దా ధ్వని అతన్ని చీకట్లోనే ఠక్కున ఆపేసింది.

"దయచేసి లైటు వేయకండి! కళ్ళు మండిపోతున్నాయి. రెండు రోజులనుండి లేచి నుంచోలేకపోతున్నాను" బరువుగా పలికిందామె.

"ఏమయింది కనకం!" వెనుదిరిగి మంచం వంక నడిచేడు వెంకటప్పయ్య.

"ఏవండీ బట్టలిప్పకండి!"

వెంకటప్పయ్య ఆగిపోయేడు.

"బట్టల్ని విప్పకముందే దయచేసి వీధిలోని డాక్టరుగారినడిగి కళ్ళమంటకీ, తలనొప్పి మాత్రలనడిగి తీసుకురండి! యూనిఫాంలో వుంటే మిమ్మల్ని ఎవరూ ఆపరు. భరించలేకుండా వున్నాను. ప్లీజ్! వెళ్ళిరండి!" దీనంగా పలికింది కనకం.

వెంకటప్పయ్య చీకట్లోనే స్టాండ్‌మీద పడవేసిన షర్టునందుకుని తొడుక్కుని నిద్రమత్తుతో వాలిపోతున్న కళ్ళని బలవంతంగా అరికడుతూ వీధిలోకి నడిచేడు. తను వేసుకున్న షర్టెందుకో మరీ లూజుగా వుందనిపించింది. కాని ఆ విషయాన్ని పట్టించుకోకుండా నిద్రమత్తులోనే వెళ్ళి వీధి చివరన డాక్టర్‌గారింటి తలుపుల్ని తట్టాడు వెంకటప్పయ్య.

అర్ధరాత్రిపూట తలుపుల్ని తట్టే రోగులపై నిర్మొహమాటంగా విసుక్కునే డాక్టర్‌గారి సతీమణి కాస్తా తలుపు తీస్తూనే యూనిఫారంలో వున్న వెంకటప్పయ్యవంక విస్తుపోతూ చూచింది

"రండి!" అంటూ వేగంగా లోనికెళ్ళిపోయిందావిడ.

క్షణాల తర్వాత లోపలినుంచే డాక్టరుగారి గొంతు వినిపించింది.

"ఏమిటి వెంకటప్పయ్యా?"

"మా ఆవిడకి కళ్ళు మంటలు, తలనొప్పి! భరించలేకుండా వుంది. మాత్రలిస్తారని వచ్చాను. ఈ అర్ధరాత్రి శ్రమకి మన్నించండి!" మర్యాదపూర్వకంగా లోగొంతుకతో పలికేడు వెంకటప్పయ్య.

"అలాగే ఓ నిమిషం!" అన్నారు డాక్టరుగారు. లోపల ఆయన మందుల్ని వెదుకుతున్న ధ్వనులు వినిపిస్తుండగా అలసటతో ఓ కుర్చీలో జారగిలపడిపోయాడు వెంకటప్పయ్య.

కొద్దిసేపటికి వెలుపలికి వచ్చి మందుల్ని వెంకటప్పయ్య చేతిలో వుంచుతూ అతనివంక వింతగా చూచేరు డాక్టరుగారు.

డాక్టరుగారికి ఫీజు చెల్లించే ఉద్దేశ్యంతో జేబులు వెదకబోయి కంగారుపడసాగేడు వెంకటప్పయ్య.

"ఏమిటి వెంకటప్పయ్యా! ఇన్స్‌పెక్టర్ ప్రమోషన్ వచ్చినట్టు కనీసం మాటవరసకన్నా మాకెపుడూ చెప్పలేదే?" అంటూన్న డాక్టర్‌వంక ఆశ్చర్యంగా చూచేడు వెంకటప్పయ్య.

"అదేంటిసార్! నేనింకా హెడ్‌కానిస్టేబుల్ని కూడా కాలేదు. ఇన్స్‌పెక్టర్‌నెలా అవుతాను?" అంటూ జేబుల్నింకా వెతుకుతూనే వున్నాడు వెంకటప్పయ్య.

ఆ కంగారులోనే ఎందుకో తన భుజకీర్తులవంక చూచుకున్న వెంకటప్పయ్య విద్యుద్ఘాతం తగిలినవాడిలా ఒణికిపోయాడు.

ఇన్స్‌పెక్టర్ ర్యాంకుగల నక్షత్రాలతో తను వేసుకున్న యూనిఫాం షర్టుని చూడగానే వెంకటప్పయ్య పాదలకింద నేల కాస్తా కదిలినట్లయింది.

"అమ్మ నీ!... అంటూ కనకంపై పళ్ళు నూరుతూ ఇంటివైపు పరుగు తీశాడు వెంకటప్పయ్య.

*



## కనబడలేదు

"మీ ఆయన రాత్రంతా నిన్నేం చేశాడే" శోభనం గదిలోంచి బయటికి రాగానే అడిగారు శోభనని ఫ్రెండ్స్.

"ఏమో ఏం కనిపించలేదు. వెళ్ళగానే లైటు ఆర్పేశారు" తప్పించుకుంటూ జవాబిచ్చింది శోభన

—అడబాల సూర్యనారాయణ (తుని)



అ'బద్దం'

కొట్టాడని వదంతి లేవదీసారు. (పత్రికా క్ సెట్లో) నాకు ఏం వెయ్యాలో అర్థంకాలేదు. అయినా తాతినేని రామారావుగానీ, మరెవరైనాగానీ నన్ను కొట్టడానికి సాహసించగలరా? కాకపోతే నేను ఇలాంటి విషయాలను అంతగా పట్టించుకోను కాబట్టి అవాకులు, చెవాకులు పేలుతూ వుంటారు, వ్రాస్తూ వుంటారు. అలాంటివారికి ఎలా బుద్ధిచెప్పాలో నాకు బాగాతెలుసు అంటున్నాడు అనిల్ కపూర్.

నన్ను దర్శకుడు తాతినేని రామారావు

కృష్ణాజీ

